క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: ఓయూ రోడ్డులో గల దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, టాలీ, ఈఆర్‌పీ-9, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి నాగలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోటోషాప్, పేజ్‌మేకర్, డీటీపీ (డెస్క్ టాప్ పబ్లిషింగ్), టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెహిందీ డిజైనింగ్, సీ లాంగ్వేజ్ తదితర స్వల్పకాల వ్యవధి కోర్సుల్లో కూడా శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 23న దరఖాస్తులకు చివరి తేదీ అని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 84980 80599/99512 10441/040-27098406 నంబర్లలో సంప్రదించగలరు.

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని ప్రముఖ న్యాయవాది, ఏంజెల్స్ ప్రీ స్కూల్ చైర్మన్ వేణుగోపాల్ అన్నారు. శనివారం సాయంత్రం పాఠశాల ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, వారి భవిష్యత్తును ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సంతోష్‌లక్ష్మి, ప్రిన్సిపాల్ మేరీ ఉపాధ్యాయులు తులసీ, జయశ్రీ, మాలతి, జయలక్ష్మి తదితరులున్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకతే బీజేపీ విజయం

చిక్కడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. అపూర్వమైన మద్దతు ఇచ్చిన గాంధీనగర్ డివిజన్ ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీపై ఉపాధ్యాయులు పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు.

కల్లు కంపౌండ్ ఎత్తివేయాలని వినతి



ఎక్సైజ్ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముషీరాబాద్: దయారా మార్కెట్ చౌరస్తా నుంచి హరినగర్ మధ్యలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్లు కంపౌండ్‌ను వెంటనే ఎత్తివేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పిపుల్ అండ్ పీస్ కమిటీ అధ్యక్షుడు ముక్తార్ హుస్సేన్ ఆధ్వర్యంలో పలువురు ఎక్సైజ్ కమీషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక బీజేపీ నాయకులు చక్రపాణి ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారికి వినతిపత్రం ఇచ్చారు. కంపౌండ్‌కు సమీపంలో ఓ వైపు ఆసుపత్రి, మరోవైపు మెడికల్ షాపు, పాఠశాలలు ఉన్నాయన్నారు. మహిళలు ఈ రహదారి వైపు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కల్లు కంపౌండ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బండి సంజయ్‌కు మద్దతుగా బీజేపీ మహిళా మోర్చా



కాచిగూడ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక బీఆర్ఎస్ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. గత నాలుగు రోజుల క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై చేసిన ఆరోపణలకు మహిళా కమీషన్ విచారణకు వచ్చిన బండి సంజయ్‌కు మద్దతుగా కాచిగూడ నుంచి మహిళలు పెద్ద ఎత్తున మహిళా కమీషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. బీజేపీ మహిళా ప్రతినిధులు గీతారాణి, శ్యామల, బండ కార్తీకరెడ్డి, దీపికా సురేష్, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

అంబర్‌పేట: నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ ఓమర్‌నగర్‌లో రూ.5 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఇప్పటికే నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. జలమండలి అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు..

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని షేర్‌అలీ వీధిలో 30 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని షేర్ అలీ వీధిలో రూ.11 లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులను జలమండలి సెక్షన్ మేనేజర్ నవీన్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జలమండలి ఉన్నతాధికారులతో కలిసి పర్యటించి సమస్య తీవ్రతను తెలుసుకున్నామన్నారు. భవిష్యత్తులో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ఆధునిక పద్ధతిలో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. స్థానికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి బోరింగ్ వేయిస్తామన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు రామారావు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బల్ల ప్రశాంత్, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ చారి, నాయకులు పూసగౌరఖ్‌నాథ్, దీన్‌దయాల్ రెడ్డి, భిక్షపతియాదవ్, రాజు, సదా, పరశురామ్‌యాదవ్, రూప తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు రచనశ్రీ, పావని

కవాడిగూడ: హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించడంతో పాటు వేగంగా పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, గాంధీనగర్ కార్పొరేటర్ పావని అధికారులకు సూచించారు. శనివారం కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్‌లలో జరుగుతున్న హుస్సేన్‌సాగర్ నాలా ప్రహరీ నిర్మాణ పనులను వారు ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ ప్రవీణ్, ఏఈ శ్యామ్‌సుందర్‌లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అశోక్‌నగర్ నాలాతో పాటు దోమలగూడ సూరజ్‌నగర్, అరవింద్‌నగర్‌లో వారు పర్యటించి పనులను పరిశీలించారు.

- వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో నాలా ప్రహరీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సూరజ్‌నగర్‌లో నాలా ప్రహరీ ఎత్తు పెంచాలని లేదంటే బస్తీలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.
- చిన్నపిల్లలు ఆడుతూ.. నాలాలో పడిపోయే ప్రమాదం ఉందని నాలా ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో పాత ప్రహరీకి పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, కుమార్‌గౌడ్, రమేష్‌బాబు, దిలీప్‌యాదవ్, అనిల్ తదితరులున్నారు.

స్వప్నలోక్ మృతులకు రూ. 25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గారే వెంకటేష్‌మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారే వెంకటేష్‌మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్వప్నలోక్ కంప్లెక్స్ శిథిలావస్థకు చేరిందంటూ ఫిర్యాదులు వచ్చినా.. పట్టించుకోని అధికారులను సస్పెండ్ చేయాలన్నారు.

- నగరంలో గత కొంత కాలం నుంచి భారీ అగ్ని ప్రమాదాలు సంభవించి ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు.
- స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నగరంలోని పాత భవనాలు, కంప్లెక్స్‌లను గుర్తించి కూల్చివేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు. టీఎంపీఎస్ రాష్ట్ర మీడియా అధ్యక్షుడు మాదిరే నర్సింగరావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సింగ్, రాష్ట్ర మహిళ విభాగం కో-ఆర్డినేటర్ రోషిణి విజయలక్ష్మి, లక్ష్మీబాయి, మాణెమ్మ, భూపాల్, రాజేష్, దానియేల్, ధనలక్ష్మి, మోహన్, వేణు పాల్గొన్నారు.

వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి !

నల్లకుంట: వేసవి ప్రారంభంలోనే పలు బస్తీల్లో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయి. జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే స్థానికులు వాపోతున్నారు. పాత నల్లకుంట డాక్టర్ చారీలేన్‌లో గత కొద్ది రోజులుగా కుళాయిల ద్వారా లో ప్రెషర్‌తో గంట 30 నిమిషాలు మాత్రమే నీటి సరఫరా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగేందుకు కూడా సరిపడ తాగునీరు లభించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు విధిలేని పరిస్థితిలో బహిరంగ మార్కెట్ నుండి ఫిల్టర్ వాటర్‌క్యాన్‌లు కొనుక్కునే పరిస్థితులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. లో ప్రెషర్ నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని స్థానికులు జలమండలి అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

అంబర్‌పేట: ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో ఆయా ప్రాంతాలకు సరఫరా అవుతున్న తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోల్నాకలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య ఆదేశాల మేరకు జలమండలి అధికారులు శనివారం మరమ్మతులు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.



6 నెంబర్ చౌరస్తాలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

సాంకేతిక రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి



సైన్స్ ఫేయిర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: విద్యార్థులను శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లోని అప్రెంటిషిప్ సంస్థ ఆధ్వర్యంలో హైమావతి పాఠశాలలో సైన్స్ ఫేయిర్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ఆవిష్కరణలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్, అంబర్‌పేట ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, అప్రెంటీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతిని భావితరాలకు అందించాలి



కళాకారులను సత్కరిస్తున్న యాదగిరి, దైవజ్ఞశర్మ

చిక్కడపల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి అన్నారు. విశ్వకళామండలి ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు త్యాగరాయగానసభలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యాదగిరి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, నృత్యగురువు నిక్షితగౌడ్, దివ్య, కిరణ్మయి, ఎన్సీ అష్టకుమారి, ప్రసాద్‌రాయుడు, సంగీత గురువు నాగజ్యోతి, విశ్వ కళామండలి సంస్థ అధ్యక్షురాలు అలివేలు మంగ, కార్యదర్శులు రాంనర్సయ్య, ప్రత్యేక సలహాదారు శ్రీకాంత్, జానపద కళాకారుడు డప్పు స్వామి, మధు, రేవతి, సావిత్రి పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు భరోసా



అంబర్‌పేట: ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదల వైద్యానికి భరోసా కలుగుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. శనివారం బీజేవైఎం అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ సునిల్ ఆధ్వర్యంలో అంబర్‌పేట దుర్గానగర్‌లో ఆయుష్మాన్‌భారత్ పథకం దరఖాస్తులను అందజేశారు. సుమారు 200 మందికి దరఖాస్తులు పంపిణీ చేసి ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య పథకంతో లబ్ధి పొందాలని ఆయన సూచించారు. బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, రమేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

అన్నమాచార్యుల మహానగర సంకీర్తన



ట్యాంక్‌బండ్‌పై అన్నమాచార్యుల విగ్రహం వద్ద డాక్టర్ శోభరాజు తదితరులు

కవాడిగూడ: అన్నమాచార్య భావన వాహిని ఆధ్వర్యంలో అన్నమాచార్యుల 520వ ఆరాధన ఉత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వద్ద మహానగర సంకీర్తన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌పై ఉన్న అన్నమాచార్య విగ్రహం వరకు మహానగర సంకీర్తన నిర్వహించారు. అన్నమయ్య సమేత వేంకటేశ్వరస్వామి వేషధారణలో సందీప్, అన్నమయ్య వేషధారణలో అభిరామ్‌లు పాల్గొని మహానగర సంకీర్తనలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ శోభరాజు మాట్లాడుతూ.. భక్తి సంగీతం ద్వారా భావ కాలుష్య నివారణ గురించి వివరించారు. ప్రభుత్వ సలహాదారులు రిటైర్డ్ ఐఏఎస్ కే.వీ.రమణాచారి, శైలజ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శోభరాజు శిష్యబృందం పాడిన పాటలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. డాక్టర్ నందకిషోర్, అన్నమయ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కరపత్రాల పంపిణీ



చిక్కడపల్లి: అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లైనా మాట్లాడటం లేదని మహజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జెల రాజశేఖర్‌మాదిగ ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట మహాధర్నాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో ఆ పార్టీనేతలు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. డప్పు మల్లికార్జున్ మాదిగ, సీనియర్ నాయకులు శ్యామ్‌రావు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎల్లయ్య, రాజుమాదిగ బస్తీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్‌మాదిగ, తరుణ్‌మాదిగ తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. దోమలగూడ అమంత్రణ్ బెంగాలీ రెస్టారెంట్ వద్ద 55 ఏళ్లున్న వ్యక్తి ఫుట్‌పాత్‌పై పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడలో రూ.17లక్షల హవాలా డబ్బు సీజ్



సీజ్ చేసిన హవాలా డబ్బు

కాచిగూడ: సినీ ఫక్కీలో హవాలా డబ్బును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.17 లక్షల హవాలా సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బడిచౌడిలో నివాసముంటున్న హరినారాయణ కొఠారి (33) తిరుమలగిరిలో నివసించే వినయ్‌తో కలిసి హవాలా వ్యాపారం చేస్తున్నాడు. కాగా కొఠారి వినయ్‌కి ఫోన్ చేసి హవాల సొమ్ము ఇస్తానని ఓ వ్యక్తిని ఇచ్చి పంపమని చెప్పాడు. దీంతో సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన శంషేర్ కుమారుడు సోయల్ (25)ను కఠారి వద్దకు పంపాడు. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ఆర్టీసీ క్వార్టర్స్ వద్ద హరినారాయణ కఠారి సోయల్‌కు రూ.17 లక్షలు ఇస్తుండగా కాచిగూడ పోలీసులు దాడిచేసి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి హవాలా డబ్బుతో పాటు 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హవాల సొమ్మును కోర్టుకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శనివారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. అసలు సూత్రదారి వినయ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సాధన్ పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఛలో విద్యుత్ సౌధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, వైస్ చైర్మన్ శ్రీధర్, కన్వీనర్ రత్నాకర్‌రావులు ప్రకటించారు. శనివారం ఆర్టీసీ కల్యాణ మండపంలో 'తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ' ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛలో విద్యుత్ సౌధన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

- ధరల పెరుగుదలకు అనుగుణంగా 30 శాతం పీఆర్‌సీని ప్రకటించడంతో పాటు 1999-2004 వరకు నియమితులైన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.
- ఆర్టిజన్స్‌కు వేతన సవరణ చేయాలని మెడికల్ రియంబర్స్‌మెంట్ ప్రకటించాలని పేర్కొన్నారు.
- విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నెల 24వ తేదీలోపు తమ సమస్యలను పరిష్కరించాలని లేదంటే విద్యుత్ సౌధన్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. జేఏసీ కో-కన్వీనర్ బీ.సీ.రెడ్డి, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి, కో- కన్వీనర్ అనిల్, సహాయ కార్యదర్శి వెంకన్నగౌడ్ ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్..

కాచిగూడ: డివిజన్‌లోని బర్కత్‌పుర, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వీటికి మరమ్మతులు చేపట్టి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విన్నవించినా.. వారు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేసి వెళ్లిపోతారని తిరిగి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న సందర్భాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌కు సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోవడం లేదు..

ప్రజా ప్రతినిధులు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నింబోలిఅడ్డ సమోసా పార్కు దగ్గర మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారినా. ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదని స్థానికులు ఆరోపించారు.

కార్పొరేటర్ పాదయాత్ర చేసినా..

సంబంధిత అధికారులకు సమస్యను వివరించినా స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



నింబోలిఅడ్డ సమోసా పార్కులేన్‌లో..



చెప్పల్ బజార్ రోడ్డులో ఇలా..

టీఎస్‌పీఎస్సీ వ్యవహారంపై విపక్షాల నిరసన

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను ప్రక్షాళన చేయాలి : కాంగ్రెస్
- రద్దు చేసి బాధ్యులను శిక్షించాలని బీజేపీ డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న బీజేపీ నేతలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో జరిగిన పేపర్ లీకేజీలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి తక్షణమే పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన పడకవేసిందని ప్రభుత్వంలో ఏ శాఖ సరిగ్గా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు రద్దు చేసిన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. తక్షణమే పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలపై రుద్దడం అవివేకమని, ప్రతిపక్ష పార్టీలు పేపర్లు లీకు చేసే అవకాశాలు ఉండవని స్పష్టం చేశారు.
- అధికార పార్టీ పేపర్లు లీక్, నోటిఫికేషన్లు జారీ చేస్తూనే నిరుద్యోగులెవరూ.. ఉద్యోగాలకు ఎంపిక కాకుండా చేస్తున్నారని ఆరోపించారు.
- రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ తక్షణమే సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.
- టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కాచిగూడ నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. చింతల రాంచంద్రారెడ్డి, డాక్టర్ ఎస్.గౌతంరావు, పాండుయాదవ్, సురేందర్ రెడ్డి, శంకర్‌యాదవ్, కిషోర్, చక్రి, వినయ్, చిట్టి శ్రీధర్, రమేష్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీతో నిరుద్యోగులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వందలాది మంది అభ్యర్థులను శనివారం ఆయన కలసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేళ్ల తర్వాత నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ పడిందన్న సంతోషం ప్రశ్న పత్రాల లీకేజీతో ఆవిరైపోయిందన్నారు.

- రాష్ట్రంలో మొత్తం 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని వారు ఇన్నాళ్లు కళ్లల్లో వత్తులు వేసుకుని వేచి చూస్తే వచ్చిన నోటిఫికేషన్‌లో నిర్వహించిన రాతపరీక్ష కూడా రద్దు కావడంతో టీఎస్‌పీఎస్సీ అసమర్థత తేలిపోయిందన్నారు.
- టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు, రాకేశ్ సింగ్, టిజాక్ వేణు, ఆప్ విద్యార్థి నాయకుడు పరీక్షిత్, ఏబీవీపీ నాయకుడు ఎల్.అక్షయ్, సలీమ్ తదితరులున్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి..

కాచిగూడ: టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని తెలంగాణ ప్రజా జీవన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. టీఎస్ పీఎస్సీ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.